
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల జిల్లా వార్తలు 5
ఆదివారం 6 అక్టోబరు 2024



శ్రీశైలానికి స్వల్పంగా వరద

శ్రీశైలం, అక్టోబరు 5: శ్రీశైలం డ్యామ్‌కు జూరాల నుంచి 38,621 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 117 క్యూసెక్కులు మొత్తం 38,783 క్యూసెక్కుల నీరు వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమాయానికి 43,742 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. డ్యామ్ ప్రస్తుత నీటిమట్టం 882.00 అడుగులుగా, నీటి నిల్వ 198.8120 టీఎంసీలుగా నమోదయింది. ఏపీ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27,350 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,163 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

ఓటమిని జయించి..

- రెండు ప్రయత్నాల్లో సివిల్స్‌లో విఫలమయ్యా
- ఐపీఎస్ కేడర్‌లో నేరాల నియంత్రణపై ముద్ర
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నంద్యాల క్రైం, అక్టోబరు 5: ప్రపంచంలో ఓటమికి మించిన గురువు లేడంటారు. పరాజయాన్ని సోపానంగా మలుచుకుంటే ఎన్నటికైనా విజయం సాధించవచ్చు. ఎంతోమంది 'ఫెయిల్యూర్ గురూ' నుంచి స్ఫూర్తి పొందిన వారు ఉన్నత స్థానాల్లోకి చేరుకున్నారు. అదే కోవలోకి వస్తారు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్. మొక్కవోని దీక్ష.. వెన్నుచూపని సంకల్పం.. మరో లక్ష్యం కోసం కఠోర సాధన... వెరసి సెల్యూట్ చేయించుకునే స్థాయికి చేరుకున్నారు. తొలి రెండు ప్రయత్నాల్లో విఫలమైనా.. పట్టుదలతో కష్టపడి చదివారు. నిరాశ, నిస్పృహకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా మలచుకొని కసితో చదివారు. మూడోసారి సివిల్స్‌లో విజయం సాధించి ఐపీఎస్‌కు ఎంపిక య్యారు. గత ఆరేళ్ల తన పరిపాలనా అనుభవంలో పోలీస్ శాఖలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పనిచేసిన ఆయన మొట్టమొదటిసారిగా నంద్యాల జిల్లాకు ఐపీఎస్ కేడర్ ఎస్పీగా వచ్చారు. అనతికాలంలోనే పాలనలో తనదైన మార్కును చూపించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, విజివల్ పోలీసింగ్‌తోపాటు వివిధ నూతన సంస్కరణలను తీసుకువచ్చి సాంకేతికతతో నేరాల నియంత్రణపై దృష్టి సారించారు. అటు ప్రజలతోనూ ఇటు సిబ్బందితోనూ మమేకమవుతూ ముందుకెళ్తున్నారు. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం

ఎస్పీ : మాది చండీఘర్ రాష్ట్రం. అమ్మ కిరణ్ రాణా గృహిణి. తండ్రి కమల్‌జిత్ సింగ్ రాణా. ఈయన రిటైర్డ్ ఆప్తమాలజిస్ట్, చెల్లెలు నేహా రాణా ఈమె ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో కెనడా దేశంలో స్థిరపడ్డారు. పది, ఇంటర్మీడియట్ చండీఘర్‌లోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేశా.

సివిల్స్‌కు స్ఫూర్తి ఎవరు?

ఎస్పీ: ఇంజనీరింగ్ విద్య పూర్తయిన అనంతరం రెండు పర్యాయాలు సివిల్స్ పరీక్షలు రాశాను. రెండు పర్యాయాలు కొద్దిపాటిలో అవకాశంతో చేజారింది. దీంతో పట్టుదల పెరిగి ఎలాగైనా జీవితాశయాన్ని నెరవేర్చుకోవాలని రెట్టించిన ఉత్సాహంతో చదివి మూడోసారి సివిల్స్‌లో ర్యాంక్ సాధించాను. 2018లో జరిగిన సివిల్స్‌లో ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యాను. సివిల్స్ సాధనలో నాకునేనే స్ఫూర్తిగా నిలిచాను. క్రికెట్ అంటే బాగా ఇష్టపడతాను. పుస్తకాలు చదువుతా. ముఖ్యంగా నాన్‌ఫిక్షన్ పుస్తకాలు ఎక్కువగా చదువుతా. నాన్ ఫిక్షన్ పుస్తకాలు వాస్తవికతకు దగ్గరగా ఉండటంవల్లే వాటిపై మక్కువ చూపుతాను.

మొదటి పోస్టింగ్

ఎస్పీ : ఆంధ్రప్రదేశ్‌లోనే మొదటి పోస్టింగ్. అనంతపురం జిల్లాలో ఆరు నెలలు శిక్షణ. అక్కడ శిక్షణ విధులు ముగించుకున్న అనంతరం తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో గ్రేహౌండ్స్ విభాగంలో శిక్షణ. తర్వాత ఏఎస్పీగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో పనిచేశా. ఏఎస్పీగానే అనకాపల్లి జిల్లా రంపచోడవరం జిల్లా నరసాపురంలో పోస్టింగ్. విజయవాడలో డీసీపీగా విధులు నిర్వర్తించాను. అక్కడి నుంచి నంద్యాల జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.

నంద్యాల జిల్లాలో పనితీరు

ఎస్పీ : జిల్లా పరిస్థితిని అధ్యయనం చేశాను. ఈ రెండు నెలల్లో జిల్లాలోని శాంతిభద్రతలపై అవగాహన పెరిగింది. ముఖ్యంగా శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించా. అందులో భాగంగానే కొన్ని వినూత్న నిర్ణయాలు తీసుకున్నాం. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న పెసరవాయి, అవుకు, కొలిమిగుండ్ల, శిరివెళ్ల, ముచ్చుమర్రి లాంటి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. ఎలాంటి నేర ఘటనలు జరిగినా చర్యలు చేపట్టేందుకు ఈ సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి. అలాగే డ్రోన్ కెమెరాలను కూడా శాంతిభద్రతల పరిరక్షణలో ఉపయోగిస్తున్నాం.

రికవరీల్లో పురోగతి సాధించారా?

ఎస్పీ: నేను ఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఇప్పటికి రెండు నెలలు అయింది. ఈ రెండు నెలల్లో గ్యాంబ్లింగ్‌లో 49కేసుల్లో రూ.11,61,200రికవరీ చేశాం. మట్కాకు సంబంధించి 17కేసుల్లో లక్ష 68వేల రూపాయలు రికవరీ చేశాం. అలాగే గంజాయి విషయానికొస్తే 11.5 కిలోలు స్వాధీనం చేసుకున్నాం. 17 చోరీ కేసుల్లో రూ.36.65లక్షల విలువైన సొత్తు రికవరీ చేశాం. అలాగే మొబైల్స్ చోరీ, పోగొట్టుకున్న ఘటనల్లో మొత్తం రూ.2.40కోట్ల విలువచేసే మొబైల్స్‌ను రికవరీ చేశాం. 75,451 కిలోల పీడీఎస్ బియ్యం సీజ్ చేశాం.

సైబర్ నేరాలపై నియంత్రణ చర్యలు చేపట్టారా?

ఎస్పీ: సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం, చేస్తున్నాం. ముఖ్యంగా సైబర్ నేరాలు జరిగినప్పుడు బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే సమయంలోపే 1930నెంబర్‌కు కాల్ చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. అలా ఫోన్ చేయడంవల్ల బాధితుడిని మోసం చేసిన మోసగాడు సదరు సొమ్మును డ్రా చేయకుండా వెంటనే ఫ్రీజ్ చేయవచ్చు. 1930కు ఫోన్ చేయడంవల్ల నగదు బదిలీకాకుండా చర్యలు తీసుకుంటాం.

నేరాల నియంత్రణకు చర్యలు

ఎస్పీ : జిల్లాలో నూతనంగా క్విక్ రియాక్షన్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. ఇందులో 44మంది సభ్యులుంటారు. మొదట ఈ వింగ్‌ను నంద్యాల సబ్ డివిజన్‌లో ఏర్పాటు చేశాం. ఈ టీమ్ డీఎస్పీ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. సబ్ డివిజన్‌లో ఎలాంటి అల్లర్లు జరిగినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగినా వెంటనే ఈ టీమ్ రంగంలోకి దిగుతుంది. అలాగే వీఐపీల భద్రతకు కూడా ఈ టీమ్ పనిచేస్తుంది. ఈ టీమ్ ప్రజలకు భరోసా కల్పిస్తుంది. జిల్లాలో మొత్తం 1,407మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో 449 మంది యాక్టివ్‌గా ఉన్నారు. వీరి కదలికలపై ఇంటలిజెన్స్, ఎస్‌బీ, ఇతర నిఘా వర్గాల ఫోకస్ ఉంటుంది. వారానికోసారి వీరి కదలికలపై నిఘా వర్గాల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నా.



క్యూఆర్టీ టీమ్‌తో ఎస్పీ

ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహణ ఎలా ఉంది?

ఎస్పీ: ప్రజల సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం మంచి వేదిక. అయితే బాధితులు నేరుగా ఎస్పీని కలవకుండా సంబంధిత పోలీస్ స్టేషన్లకు వెళ్లి అధికారికి ఫిర్యాదు చేయాలి. అక్కడ న్యాయం జరక్కపోతే జిల్లా పోలీస్ కార్యాలయానికి వస్తే విచారణ చేసి పోలీస్‌స్టేషన్ అధికారి నిర్లక్ష్యం ఉన్నా, చట్టపరంగా న్యాయం చేయకపోయినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

జీపీఎస్ సిస్టం ఎలా పని చేస్తోంది?

ఎస్పీ: జిల్లా వ్యాప్తంగా 7 పోలీస్ జీపులకు, 23 పోలీస్ ద్విచక్ర వాహనాలకు జీపీఎస్ సిస్టం అమర్చాం. విధినిర్వహణలో ఉన్న పోలీసుల పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చాం. అలాగే నేరం జరిగిన ప్రాంతానికి ఏ వాహనం దగ్గరలో ఉందో సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి ఘటనా స్థలానికి ఆ వాహనాన్ని త్వరగా పంపేందుకు వీలుగా ఉంటుంది.

ఏఎస్పీగా యుగంధర్‌బాబు బాధ్యతలు



నంద్యాల క్రైం, అక్టోబరు 5: సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా ఎస్.యుగంధర్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు ఏఆర్ సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

మెరుగైన సేవలు అందించాలి - మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 5: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. దాతల సహకారంతో నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మెరుగులు దిద్దడంతో శనివారం ప్రారంభ కార్యక్రమానికి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు మరింత వసతులు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయ వనరులుగా ఉండే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను అభివృద్ధి పరిచేలా చేస్తామని చెప్పారు. మంత్రి ఫరూక్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రావడంతో స్టాంప్ రైటర్ల సంఘం నాయకులు, స్టాంప్ రైటర్లు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి, సబ్ రిజిస్ట్రార్ సత్తార్, నంద్యాల తహసీల్దార్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

విద్యతోనే చెంచుల జీవన ప్రమాణాల్లో మెరుగు

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 5: విద్యతోనే చెంచులు జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవచ్చని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. కొట్టాల చెరువు గ్రామంలో శనివారం పీఎం జన్‌మన్ పథకం కింద రూ.2.3కోట్లతో మంజూరైన గిరిజన వసతిగృహం భవనానికి కలెక్టర్ రాజకుమారితో కలిసి భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి బుడ్డా వెంగళరెడ్డి హయాం నుంచే తాము చెంచుల అభ్యున్నతి కోసం అన్ని విధాలుగా పాటుపడినట్లు తెలిపారు. పెచ్చెర్వు వాసులకు కేటాయించిన భూముల్లో చెంచులు అనుభవిస్తున్నారా..? అన్నది ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఆయా భూములకు సరైన పట్టాలు, ఆన్‌లైన్ నమోదు లేకపోవడంతో చెంచులు ప్రభుత్వ పథకాలకు నోచుకోలేకపోతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ రెవెన్యూ అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం పీఎంజన్‌మన్ పథకం కింద 50 పడకల హాస్టల్ మంజూరైందని త్వరలో వందపడకలు పెంచేందుకు తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. చెంచుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని భరోసా ఇచ్చారు.



ట్రైబల్ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా, కలెక్టర్ రాజకుమారి

గిరిజన జాతుల అభ్యున్నతి కోసమే హాస్టల్ నిర్మాణాలు: కలెక్టర్

గిరిజనజాతుల అభ్యున్నతి కోసమే పీఎం జన్‌మన్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గిరిజన హాస్టళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. నంద్యాల జిల్లాలోని మొత్తం 14 మండలాల్లోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 48 చెంచుగూడేలు ఉన్నాయని వీటిలో 2951 కుటుంబాలు ఉండగా మొత్తం 9నుంచి10వేల జనాభా ఉన్నట్లు వివరించారు. జిల్లాలో సుమారు మొత్తం 20లక్షల జనాభా ఉన్నప్పటికీ వెనుకబడిన 10వేల చెంచుజాతిని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 146 ప్రభుత్వ వసతి గృహాలు ఉండగా అందులో 40 వసతిగృహాలను ట్రైబల్స్ కోసమే ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 7 పీఎం జనమన్ హాస్టళ్లను రాష్ట్రానికి మంజూరు చేయగా అందులో ఐదు నంద్యాల జిల్లాకు మంజూరు కాగా హాస్టళ్లు శ్రీశైలం నియోజకవర్గంలోనే ఉన్నట్లు తెలిపారు. డీఈవో సుధాకర్‌రెడ్డి, జిల్లా నోడల్ ఆఫీసర్ రఘురామిరెడ్డి, ఆర్డీవో దాసు, ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ నాగలక్ష్మీ, హాస్టల్ స్థలదాత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సంరక్షణకు ప్రతిపాదనలు

డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 5: భూసంరక్షణకు రూ. 8కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు భూసంరక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూసంరక్షణ కోసం ఏయే పనులు చేపడుతారో ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారని, ఇందులో భాగంగా రూ.8 కోట్లతో రైతుల పొలాలను సారవంతం చేసేందుకు అవసరమైన పనులను గుర్తించి నివేదికను ప్రభుత్వానికి అందజేశామన్నారు. దశలవారిగా భూసంరక్షణ అభివృద్ధి పనులకు నిధులు విడుదల కానున్నాయని, త్వరలోనే ఈ నిధులు వస్తాయని రైతుల పొలాలను సారవంతం చేసే పనులు చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూసంరక్షణ పనులను అటకెక్కించారు. ఐదేళ్లుగా కనీసం ఒక్క రూపాయి కూడా భూసంరక్షణ కోసం విడుదల చేయకపోవడంతో అధికారులు, సిబ్బంది కార్యాలయాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి తలెత్తింది. ఏయే పనులు చేపట్టి రైతుల పొలాలను సారవంతం చేయాలో నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపడం తప్ప.. అక్కడి నుంచి నిధులేమి రాకపోవడంతో అధికారులు నిస్సహాయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. రైతులకు సమాధానం చెప్పుకోలేక పొలాల బాట పట్టలేని పరిస్థితి అధికారులకు ఎదురైంది.

రావణ వాహనంపై స్వామి, అమ్మవార్లు



రావణ వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

- చంద్రఘంట అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి
- శ్రీశైలంలో మూడోరోజు వైభవంగా కొనసాగిన దసరా ఉత్సవాలు

శ్రీశైలం, అక్టోబరు 5: శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, చండీహోమం, పంచాక్షరీ, భ్రామరీ, బాలాజపానుష్ఠానాలు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారి పూజలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్రపారాయణలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా కుమారి పూజలు జరిపించారు. ఈ కుమారి పూజలలో రెండు సంత్సరాలు నుంచి పది సంవత్సరాలలోపు బాలికకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించారు.

దసరా ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు అమ్మవారికి నవదుర్గా అవతారాలలో ఒకటైన చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు దశభుజాలను కలిగిన ప్రశాంతమైన వదనంతో సాత్విక స్వరూపినిగా ఉంటారు. ఈ దేవి శాంతిస్వరూపిణి అయినప్పటికీ యుద్ధోన్ముఖురాలై ఉండటం విశేషం. వాహనసేవలలో భాగంగా రావణవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవం ముంగిట జానపద కళాకారుల నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అశేష భక్తజనం గ్రామోత్సవంలో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లను కనులారా వీక్షించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.





ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న నృత్య, నాటిక ప్రదర్శనలు







నృత్యం చేస్తున్న కళాకారులు

నేడు కూష్మాండదుర్గగా అమ్మవారు

దసరా మహోత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం భ్రమరాంబికాదేవి కూష్మాండదుర్గ అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు కైలాస వాహన సేవ నిర్వహించనున్నారు.



ప్రత్యేక వేషధారణలో కళాకారులు

టెట్‌కు 168 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 5: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 168 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. శనివారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన రెండు సెషన్లకు 1265 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 1097 మంది అభ్యర్థులు టెట్‌కు హాజరయ్యారు. 168 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 635 మందికి గానూ 547 మంది హాజరుకాగా 88 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్‌లో 630 మందికిగానూ 550 మంది హాజరు కాగా, ఇందులో 80 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తనిఖీ చేసి పరీక్ష నిర్వాహకులకు సూచనలు చేశారు.

8న జాబ్‌మేళా

కర్నూలు(అర్బన్), అక్టోబరు 5: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8న నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి ఎల్ ఆనంద్ రాజకుమార్ తెలిపారు. బిర్లాగేట్ సమీపంలోని న్యాక్ శిక్షణా కేంద్రంలో ఉదయం 10గంట నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు రిలయన్స్, జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్, అంతా ప్రాజెక్టు టెక్నికల్ సర్వీసు, ఫేరాన్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, చదివి 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఈ జాబ్ మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ. పదివేల నుంచి రూ, 20 వేలకు జీతం ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి విధుల బహిష్కరణ?

- చర్చల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులకు

స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

కర్నూలు(అర్బన్), అక్టోబరు 5: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులను ఉద్యోగులు ఆదివారం నుంచి బహిష్కరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 1న దుకాణాలు మూసివేసి నిరసన తెలిపారు. స్పందించిన ప్రభుత్వం ఈనెల 5న చర్చలకు ఆహ్వానించింది. శనివారం సాయంత్రం వరకు సాగిన చర్చల్లో అసోసియేషన్ నాయకులకు మరో రెండు రోజులు ఆగాలని ఆపైన ప్రభుత్వ నిర్ణయం వెల్లడిస్తుందని పేర్కొన్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి. జతిన్ చంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 12న కొత్త మద్యం పాలసీ అమలులోకి రానున్నందున తమను చర్చల పేరుతో కాలయాన చేస్తున్నారని మండిపడ్డారు. తమకు ప్రత్యామ్నాయం చూపేంత వరకు ఆదోళనలు కొనసాగిస్తామని, ప్రస్తుతం దుకాణాల్లో విధులకు దూరంగా ఉండాలని మెజార్టీ ఉద్యోగులు కోరుతున్నారని, ఆ మేరకు ఆదివారం విధులపై ఉదయాన్నే రాష్ట్రస్థాయిలో ఓ నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఎందరో ఉద్యోగులు ప్రభుత్వ మద్యం దుకాణాల ప్రైవేట్‌పరం చేయడంతో ఉద్యోగులు రోడ్డున పడనున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 5: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో కన్వీనరు కోటా కింద పరిమిత సంఖ్యలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ లోకనాథ్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఉర్దూవర్సిటీలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కోర్సులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించదని రిజిస్ట్రార్ తెలిపారు.

సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం

- హాజరైన మంత్రి బీసీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్
- అభినందనలు తెలిపిన డోన్ నియోజకవర్గ నాయకులు



మంత్రి బీసీ సమక్షంలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి



ధర్మవరం సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న డోన్ నాయకులు

డోన్, అక్టోబరు 5: రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ధర్మవరం సుబ్బారెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. శనివారం విజయవాడలోని ఏపీఎస్ఎస్‌డీసీ కార్యాలయంలో ఐఏఎస్ అధికారులు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయంలో సుబ్బారెడ్డి తన సతీమణి మల్లేశ్వరితో కలిసి వేదపండితుల ఆశీస్సులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత డోన్ నియోజకవర్గ పార్టీ నాయకులు, అభిమానుల కోలాహలం మధ్య సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సుబ్బారెడ్డికి మంత్రి బీసీ, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్లా నారాయణ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, ఆలా మల్లికార్జున రెడ్డి, బేతంచెర్ల పట్టణ పార్టీ నాయకులు షేక్షావలి చౌదరి తదితరులు అభినందనలు తెలిపారు. అనంతరం సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధర్మవరం చిన్న నాగిరెడ్డి, గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, కిష్టన్న, ఎల్‌ఐసీ శ్రీరాములు, ఎర్రిస్వామి గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

ధర్మవరం సుబ్బారెడ్డి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్

రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన ప్రమాణస్వీకారోత్సవ సభలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ తన కష్టాన్ని గుర్తించి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పదవి ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేస్తానన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పార్టీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు డోన్ ఇన్‌చార్జిగా పని చేశానని, ఇప్పుడు అచ్చెన్నాయుడు బాధ్యతలు తీసుకున్న శాఖకు అనుబంధంగా ఉండే పదవిలో పని చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎంతో మనోధైర్యాన్నిచ్చి తనను ముందుకు నడిపించారన్నారు. డోన్ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు చేసిన కష్టంతోనే తాను ఈ స్థాయిలో ఉన్నానని, వారి రుణం తీర్చుకునేలా పని చేస్తానన్నారు. రైతుబిడ్డగా తనకు రైతుల ఇబ్బందులు తెలుసునని, వారికి సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తానని సుబ్బారెడ్డి అన్నారు.

ఫొటో ఓటర్ల నమోదుకు శ్రీకారం

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ జారీ

కర్నూలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫొటో ఓటర్ల నమోదుకు ప్రత్యేక సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా రూపొందించేందుకు షెడ్యూలు విడుదల చేశారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా రూపొందించేందుకు జిల్లాలో ఓటర్ల నమోదు అధికారులు (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు), సహాయ ఓటర్ల నమోదు అధికారులు (అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు) సిద్ధం కావాలని కలెక్టరు పి.రంజిత్‌బాషా శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు జారీ చేసిన ఆదేశాలు పాటించాలని సూచించారు. ఈ నెల 29న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఆ తరువాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ప్రజలు నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం 2025 జనవరి 1న తుది జాబితాను ప్రకటిస్తారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు త్వరగా దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు5: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ నమోదు దరఖాస్తుకు ఈనెల 7వ తేదీ చివరి తేదీ అన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18.01.2025 ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం

అవుకు, అక్టోబరు 5 : అవుకు రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహం శనివారం సాయంత్రం లభ్యమైంది. జీఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా నీటి ప్రవాహానికి మృతదేహం కొట్టుకొని వచ్చినట్లు భావిస్తున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో రిజర్వాయర్ వద్దకు చేరుకొని పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా కుళ్లిపోయి ఉండటంతో ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీయనున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సంజామల, అక్టోబరు 5: ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గిద్దలూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. శనివారం ఏఎస్ఐ రామకృష్ణా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిల్లి సుబ్బరాయుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. దాంతో మనస్తాపం చెంది చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు యువరైతు మృతి

వెలుగోడు, అక్టోబరు 5: నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలోని రేగడగూడూరు గ్రామంలో పిడుగుపాటుకు యువరైతు శివగంగాధర్ (26) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. గ్రామ శివారులోని తెలుగుగంగ కట్టపై మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోసుకున్నాడు. ధాన్యం ఆరబోసిన ప్రాంత సమీపంలో శుక్రవారం రాత్రి తన మిత్రుడు వెంకటేశ్వర్లతో కాపలా ఉంటూ నిద్రించారు. శనివారం తెల్లవారుజామున వర్షం కురుస్తున్న సమయంలో మిత్రుడు వెంకటేశ్వర్లును నిద్రలేపకుండానే శివగంగాధర్ ఒక్కడే ధాన్యంపై టార్పాలిన్ పట్టాలను కప్పేందుకు వెళ్లాడు. ఆ సమయంలో పిడుగు పడటంతో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గంగాధర్‌కు తల్లిదండ్రులు లేరు. అవ్వ దగ్గర ఉంటూ జీవనం సాగిస్తున్నాడు.

ఒకే రోజు నలుగురు చిన్నారుల మృతి

- నీటిలో పడి ముగ్గురు
- కూల్‌డ్రింక్ అనుకొని పురుగుల మందు తాగి ఒకరు
- ఎమ్మిగనూరు నియోజకవర్గంలో విషాదం



మహిరాం (ఫైల్) | సంపత్‌కుమార్ (ఫైల్) | ఉదయ్‌కిరణ్ (ఫైల్) | హనిమేష్ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్/టౌన్ అక్టోబరు 5: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఒకేరోజు నలుగురు చిన్నారులు మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. అభంశుభం తెలియని ఆ చిన్నారులు ఇంట్లో ఉంచిన పురుగు మందు డబ్బాలను చూసి కూల్‌డ్రింక్ అనుకున్నారు.. ఒకరి తర్వాత ఒకరు తాగారు. కొద్దిసేపటికి ఓ చిన్నారికి కడుపులో నొప్పి రావడంతో విషయాన్ని తల్లికి చెప్పాడు.. ఏమి జరిగిందో తెలియని ఆ తల్లి చిన్నారిని ఎత్తుకొని చూడగా చిన్నారి నోటి నుంచి పురుగుల మందు వాసన వచ్చింది. దీంతో పురుగుల మందు తాగాడని తెలుసుకొని చిన్నారిని ప్రశ్నించగా తనతో పాటు తన పక్కలో ఉన్న మరో చిన్నారి కూడా తాగినట్లు చెప్పాడు. ఆందోళనకు గురైన ఆ తల్లి, కుటుంబ సభ్యులు ఇద్దరు చిన్నారులను గ్రామంలో ప్రైవేటు వైద్యం కోసం ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే చిన్నారి మహిరాం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో చిన్నారి హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎమ్మిగనూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామానికి చెందిన కాశిం, జయలక్ష్మిలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇందులో చిన్నకుమారుడు మహిరాం(5) గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. అలాగే వారి బంధువు మహేష్, అనసూయలకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. అందులో చిన్న కుమారుడు ఏడేళ్ల హరికృష్ణ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఇరువురి కుటుంబాలు బంధువులు కావడంతో గ్రామంలోని పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. అయితే దసరా సెలవులు కావడంతో చిన్నారులు ఇంటి సమీపంలో ఆడుకుంటూ ఇంటి బయట బాత్‌రూంలో ఉన్న మందు డబ్బాలను చూశారు. కూల్‌డ్రింక్ అనుకొని ఒకరి తర్వాత ఒకరు తాగారు. తల్లి జయలక్ష్మి గమనించి బంధువులతో కలిసి హుటాహుటిన ఇద్దరిని ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మహిరాం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉన్న హరికృష్ణను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటి వరకు అల్లారి ముద్దుగా ఆడుతూ పాడుతూ అందరినీ అలరించిన చిన్నారుల్లో మహిరాం మృత్యువాత పడడం, హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వంకలో పడి 13 ఏళ్ల బాలుడి మృతి

పండుగ ఉందని ఎంతో ఆనందంతో తన అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చిన ఓ 13 ఏళ్ల బాలుడు అనంతలోకాలకు చేరుకున్న విషాద సంఘటన శనివారం ఎమ్మిగనూరు మండలంలోని పార్లపల్లిలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసుల వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండలం సంతనాగలాపురం గ్రామానికి చెందిన మణిక్యారావు పార్లపల్లిలో శాంతకుమారిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు తండ్రితో పాటు కూలీ పనులకు వెళ్తున్నారు. చిన్న కుమారుడు సంపత్ కుమార్(13) 5వ తరగతి చదువుతున్నాడు. అయితే తమ అమ్మమ్మ వాళ్ల ఊరైన పార్లపల్లిలో కోతగాళ్ల పండుగ ఉండడంతో తల్లి శాంతకుమారితో కలిసి పార్లపల్లికి వచ్చాడు. బంధువుల పిల్లలు సందీప్, జగన్‌లతో కలిసి గ్రామ సమీపంలోని ఎర్రకోట రోడ్డులో ఉన్న వంక దగ్గరకు బహిర్భూమికి వెళ్లారు. బహిర్భూమి అనంతరం వంక దగ్గర కాళ్లు కడుక్కునేందుకు వెళ్లగా సంపత్‌కుమార్ కాలుజారి వంకలో పడిపోయాడు. ఇటీవల కురిసిన వర్షాలకు వంకలో భారీస్థాయిలో నీరు ఉండటంతో నీటి ఉధృతికి మునిగిపోయాడు. భయపడిన తోటి చిన్నారులు పరిగెత్తుకుంటూ వచ్చి ఇంటి దగ్గర కుటుంబ సభ్యులకు తెలిపారు. వారి వచ్చి వంకలో మునిగిపోయిన సంపత్‌కుమార్‌ను గాలించి బయటకు తీసి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సంపత్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇదిలా ఉండగా ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన వడ్డె శివ, పార్వతిల కుమారుడు ఉపేంద్ర (10) పొలంలో ఉండగా పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఒకే రోజు మండలంలో కె.నాగలాపురంలో ఒక బాలుడు, పార్లపల్లిలో మరొక బాలుడు మృతి చెందడం, కడివెళ్లలో మరో బాలుడు పాముకాటుకు గురికావడంతో ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణమంతా చిన్నారుల బంధువుల రోదనలతో మిన్నంటింది.

నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

నందవరం: మాచాపురం గ్రామంలో నీటి కుంటలో పడి శనివారం ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామంలోని బీవీ మోహన్‌రెడ్డి కాలనీ సమీపంలో దాయాదుల పిల్లలైన హనుమేష్(6) ఉదయ్‌కిరణ్(11) బహిర్భూమికి వెళ్లారు. హనుమేష్ కుంటలో నీరు తెచ్చేందుకు వెళ్లి జారి అందులో పడ్డాడు. హనుమేష్‌ను కాపాడేందుకు కుంటలోకి దూకాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో గిలగిల కొట్టుకోవడాన్ని స్నేహితులు వంశీ, చరణ్‌లు చూసి కేకలు వేశారు. దీంతో చుట్టు పక్కల వారు వచ్చి వారిని బయటకు తీసి ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. తల్లిదండ్రులు, బంధువుల రోదనలు చూపరులను కంట తడిపెట్టించాయి. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను తెలుసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

చెస్ చాంపియన్‌గా రామకృష్ణ కళాశాల జట్టు

నంద్యాల రూరల్, అక్టోబరు 5 : రాయలసీమ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్ చాంపియన్‌గా నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్, పీజీ కళాశాల క్రీడాకారులు నిలిచారని ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. కర్నూలులోని సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆర్‌యూ అంతర్ కళాశాలల చెస్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు హర్షశ్రీ, ఆసియా, రుక్సానా, వినీతలు అత్యంత ప్రతిభకనబరచి మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారన్నారు. పోటీల్లో ఆర్‌యూ పరిధి నుంచి 10జట్లు పాల్గొనగా తమ కళాశాల విజేతగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. విజేతలను డా.రామకృష్ణారెడ్డితోపాటు ఆ విద్యాసంస్థల ఫిజికల్ డైరెక్టర్ విజయకుమారి, స్పోర్ట్స్ మేనేజర్ హేమంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో రాణించేలా శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

నంద్యాల రూరల్, అక్టోబరు 5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్టు క్రీడాకారులకు శనివారం గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి క్రీడాదుస్తులు అందజేశారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు క్రీడాకారులను షేక్షావలిరెడ్డి పరిచయం చేసుకున్నారు. ఆదివారం నుంచి నంద్యాలలో ఐదురోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ బాల, బాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభచూపి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ కార్యదర్శి విజయకుమార్, పీడీ శ్రీధర్, పీఈటీ సుబ్బారావు పాల్గొన్నారు.

'అనుమతులు లేని బోట్లను నిలిపేయాలి'

కొత్తపల్లి, అక్టోబరు 5: కొత్తపల్లి మండలంలోని సిద్దేశ్వరం, సంగమేశ్వరం నుంచి సోమశిలకు కృష్ణానదిలో అనుమతుల్లేకుండా నడుపుతున్న మరబోట్లను నిలుపుదల చేయాలని కొత్తపల్లి జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, మండల కన్వీనర్ కిచ్చన్నగారి సుధాకర్ రెడి డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు అర్హులైన అన్ని అనుమతులు ఉన్న మరబోట్ల నిర్వాహకులకు న్యాయం చేయాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా బోటు నిర్వహకులు జగపతిరావు, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లుతో కలిసి తహసీల్దార్ ఉమారాణికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బోటు నిర్వహకులు కురువయ్య, ఎం.నరసింహులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలి

ఆత్మకూరు, అక్టోబరు 5: పంటల సస్యరక్షణ చర్యలపై రైతు సేవా కేంద్రాల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ, ఆత్మకూరు ఏడీఏ అంజనేయ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు వ్యవసాయ డివిజన్‌లో సాగుచేసే ప్రధాన పంటల్లో వరి, మొక్కజొన్న, మిరప, మినుము తదితర పంటలకు సంబంధించి సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు విష్ణువర్ధన్ రెడ్డి, హేమలత, మహేష్, ఫణీశ్వరరెడ్డి, పవన్‌కుమార్ ఉన్నారు.

విద్యతోనే చెంచుల అభివృద్ధి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

వెలుగోడు, అక్టోబరు 5: విద్యతోనే చెంచుల అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం వెలుగోడు పట్టణంలోని గండిపేటలో 2.70 కోట్లతో వంద మంది విద్యార్థుల వసతి గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రతి గిరిజన కుటుంబం జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని అన్నారు. సాంప్రదాయలను వీడకుండా ఆధునిక ప్రపంచంతో చెంచులు పోటీ పడాలని సూచించారు. ప్రతి చెంచు కుటుంబానికి పక్క గృహాన్ని నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, 50 ఏళ్లకే చెంచులకు పింఛను అందించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. అనంతరం చెంచులతో సమావేశమై వారితో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నారపు శశిరెడ్డి, కలాం, ఖలీల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

జూపాడుబంగ్లా, అక్టోబరు 5: ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీడీవో గోపికృష్ణ అన్నారు. శనివారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోను మండల టీడీపీ నాయకులు గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు కలిసి పుష్పగుచ్ఛంతోపాటు శాలువాలతో సత్కరించారు.

మహానందిలో గంజాయి నిందితుడు అరెస్టు

మహానంది, అక్టోబరు 5: మహానంది సమీపంలోని అయ్యన్న నగర్ తెలుగుంగ కాల్వ పరిసరాల్లో అనుమానాస్పందంగా సంచరిస్తున్న గంజాయితో ఉన్న సునీల్‌కుమార్ అనే వ్యక్తి అదుపులోకి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం మహానంది పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గంజాయి విక్రయించే వ్యక్తి వివరాలను తెలిపారు. శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన కంపరాజు సునీల్‌కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని నుంచి 2.114 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేసి నంద్యాల మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్‌కు హాజరుపర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.


పాణ్యంలో అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు


నంద్యాల: సంజీవనగర్ రామాలయంలో చంద్రఘంటదేవి అలంకారంలో అమ్మవారు


మహానందిలో మయూర వాహనంపై చంద్రఘంట దుర్గ గ్రామోత్సవం


మహానందిలో మయూర వాహనంపై అమ్మవారు


పాములపాడులో అన్నపూర్ణదేవి అలంకారంలో..

చంద్రఘంట అలంకారంలో అమ్మవారు

మయూర వాహనంపై ఊరేగింపు

మహానంది, అక్టోబరు 5: మహానంది క్షేత్రంలో దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు కామేశ్వరీదేవి చంద్రఘంట దుర్గ అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చింది. శనివారం ఆలయ ప్రాంగణంలోని యాగశాల మంటపంలో వేదపండితులు, రుత్వికులు యథావిధిగా హోమాలు, కుంకుమార్చన పూజలను నిర్వహించారు. రాత్రి కామేశ్వరీదేవిని చంద్రఘంట దుర్గ అలంకారంతో అమ్మవారిని అలంకరించారు. మయూర వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు, టెంపుల్ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలోని ఆత్మకూరు, కొత్తపల్లి, నందికొట్కూరు, నంద్యాల, మిడుతూరు, మండలాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి చేశారు.


మిడుతూరులో అన్నపూర్ణ దేవిగా అమ్మవారు


ఆత్మకూరులోని కిషన్‌సింగ్ వీధిలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న దుర్గాదేవా అమ్మవారు


కొత్తపల్లి: అన్నపూర్ణ దేవి అలంకరణలో కొలనుభారతి సరస్వతి అమ్మవారు


నందికొట్కూరు: వేంకటేశ్వర స్వామి అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

'విద్యుత్ భారం మోపడం అన్యాయం'

ఆత్మకూరు, అక్టోబరు 5: విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం అన్యాయమని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్రలు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2022-23 సంవత్సరానికి వినియోగించుకున్న విద్యుత్‌పై అదనంగా సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.7200కోట్ల భారం వేయడం సరికాదని అన్నారు. సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశా రు.

ముళ్లపొదల తొలగింపు

కొత్తపల్లి, అక్టోబరు 5: కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం నుంచి బలపాలతిప్ప, జానాలగూడెం వెళ్లే రహదారికిరువైపులా ముళ్ల పొదలను ఎక్స్‌కవేటర్ సాయంతో శనివారం తొలగించారు. టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఆదేశాల మేరకు గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ముళ్లపొదలను తొలగించినట్లు తెలిపారు.

చేసిన పనులకు బిల్లులు చెల్లించండి

ఈవోను కలిసిన కాంట్రాక్టర్లు

మహానంది, అక్టోబరు 5: మహానంది క్షేత్రం అభివృద్ధిలో భాగంగా టెండర్ పక్రియ పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం మహానంది ఆలయంలో ఆన్‌లైన్ టెండర్ ద్వారా రూ. లక్షల్లో అభివృద్ధి పనుల నిర్మాణాలు పూర్తి చేసిన కొంతమంది కాంట్రాక్టర్లు శనివారం ప్రధాన కార్యాలయంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని కలిశారు. నిర్మాణాల కోసమై తెచ్చిన నగదుకు వడ్డీలు పెరిగాయని, అవి చెల్లించలేక తిరిగి బాకీలు చేస్తున్నట్లు శ్రీశైలంకు చెందిన క్లాస్ 111 సివిల్ కాంట్రాక్టర్ టి. నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. 2023 మహానందిలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో భాగంగా తాను చేసిన రూ.లక్షలాది ఏర్పాట్ల పనులను రూ.లక్షల్లో బాకీ తెచ్చి పనులు చేసినా పార్టు పేమెంట్ మాత్రమే చెల్లించారని తెలిపారు. అయితే ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ తన హయాంలో జరిగిన పనులకు మాత్రమే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు.

బుక్‌కీపర్ ఎంపిక వాయిదా

జూపాడుబంగ్లా, అక్టోబరు 5: ఇటీవల అరుణోదయ గ్రామైక్య సంఘం బుక్‌కీపర్ ఎంపిక వాయిదా పడింది. అంతకముందు పని చేసి బుక్‌కీపర్ జ్యోతి స్త్రీనిధి డబ్బులు కట్టకుండా సొంతానికి వాడుకుందన్న ఆరోపణతో వెలుగు ఏపీఎం పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. అనంతరం జ్యోతిని బుక్‌కీపర్ విధుల నుంచి తొలగించారు. కొత్త బుక్‌కీపర్‌ను ఎంపిక చేయాలని ఈనెల 3న దరఖాస్తులను ఆహ్వానించారు. శనివారం బుక్‌కీపర్ ఎంపిక చేయాలని జూపాడుబంగ్లాలోని మహిళ పొదుపు భవనం వద్ద సమావేశం నిర్వహించారు. బుక్‌కీపర్ జ్యోతి అక్కడికి వచ్చి ఎలా ఎంపిక చేస్తారని ఏపీఎం అంబమ్మను నిలదీశారు. కొత్తగా బుక్‌కీపర్‌ను ఎన్నుకునేందుకు వారి దగ్గర రూ. 1.5 లక్షలు తీసుకుని తనను తొలగించావని ఆరోపించింది. దీంతో ఇరువురి మధ్య వాగ్వావాదం జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని నివారించారు. ప్రస్తుతం బుక్‌కీపర్ ఎంపిక వాయిదా వేసుకోవాలని ఏఎస్‌ఐ మేరీజయంతి సూచించారు. దీంతో ఎంపిక వాయిదా పడింది.

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, అక్టోబరు 5: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన పి.వి కృష్ణంరాజు అనే భక్తుడు రూ. 1,00,501 విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. అలాగే కర్నూలుకు చెందిన జి.హరికిషన్ సింగ్ దంపతులు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు మధుసూదర్‌రెడ్డికి అందజేశారు.


తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

కష్టం..నష్టం

- భారీ వర్షంతో నేలవాలిన పంటలు
- తడిసిన వరి, మొక్కజొన్న ధాన్యం




వేంపెంటలో తడిసి ముద్దయిన మొక్కజొన్న ధాన్యం

గడివేముల, అక్టోబరు 5: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. బూజనూరు, కరిమద్దెల, పెసరవాయి, గ్రంధివేముల గ్రామాల్లో అరబెట్టిన ధ్యానం తడిసిపోయింది. కొన్ని బస్తాలు నీటిలో మునిగిపోయాయి. తడిచిన ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. తడిచిన ధాన్యాన్ని వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. తడిచిన ధాన్యా న్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మిడుతూరు: మిడుతూరు మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురవవడం వల్ల మండలంలోని అలగనూరు గ్రామ పరిధిలో వరి పంటలు నీట మునిగాయి. నీటిలో మునిగిన వరి పంటలను చూసిన రైతులు పెట్టిన పెట్టుబడులు చేతికి రావని ఆందోళన చెందుతున్నారు.

పగిడ్యాల: మండలంలోని గ్రామాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతింది. కల్లాలో అరబోసిన ధ్యానం తడిసిపోయింది. మండలంలో శనివారం తెల్లవారుజామున 8మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఎఎస్‌వో ఎల్లగౌడ్ తెలిపారు.


గడివేముల: వర్షపు నీటిలో ధాన్యం

రంగుమారిన మొక్కజొన్న

పాములపాడు: వేం పెంట గ్రామం శివార్లలోని చిట్టడవి బయలు ప్రదేశంలో, గ్రామానికి చెందిన దాదాపు వందమంది రైతులు మూడు వందల ఎకరాలలో కోసిన మొక్కజొన్న పంటను ఆరబోశారు. శనివారం తెల్లవారు జామున ఉన్నట్టుండి భారీవర్షం కురువడంతో ధాన్యం తడిసిపోయింది. అటవీ ప్రాంతం కావడంతో వంకలు పొంగి ప్రవహించడంతో మొక్కజొన్న ధాన్యం కొట్టుకపోయి బురదలో కలిసిపోయాయి. వర్షం కారణంగా దాదాపు ఏడువేల క్వింటాళ్లకు పైగా మొక్కజొన్న ధాన్యం దెబ్బతిన్నాయి. గ్రామ శివార్లలోని ఎదురుగుమ్మవాగు ఉప్పొంగడంతో వాగును దాటే క్రమంలో శ్రీనివాసులుకు చెందిన మోటారు సైకిల్ నీటి ఉధృతికి గల్లంతైంది.

ధ్యానాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి వర్షం కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటను, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. బురదలో కొట్టుకుపోయిన ధాన్యానికి ప్రభుత్వం పరిహారం చెలించాలన్నారు.


ప్రభుత్వం ఆదుకోవాలి

నందికొట్కూరు, అక్టోబరు 5: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నందికొట్కూరు పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో ఇండోర్ స్టేడియం మైదానంలో మొక్కజొన్న రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో అత్యధికంగా మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని, పంట చేతికి వచ్చిన తర్వాత గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. భారీ వర్షాల వల్ల చెతికి అందిన పంట నీటిపాలైందన్నారు. తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ నాయకులు చిన్న రాజు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, రమేష్‌బాబు, దేవనూరు రాజు, స్వాముల నాయుడు, షేక్షావళి, భాస్కర్ గౌడ్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గడివేముల: మొక్కజొన్న రైతులు దళారుల చేతిలో నష్టపోతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్నలు అన్నారు. మండలంలోని కొర్రపోలూరు, తిరుపాడు గ్రామాల్లోని మొక్కజొన్న రైతులతో వారు సమావేశమయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, బాష, కొర్రలూరు రైతు సంఘం నాయకులు ఇబ్రహీమ్, రసూల్ పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో కురిసిన అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న దాన్యాన్ని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి పరిశీలించారు శనివారం ఆయన రైతులతో మాట్లాడి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు.


పంట బురదలో కలిసిపోయింది



మా సొంత పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని ఆరు ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశాను. సుమారు రూ. 1.30 లక్షల పెట్టుబడి పెట్టాను. పంట బాగా వచ్చింది. అమ్మే సమయానికి వర్షం కురిసి వంకలో గింజలు కొట్టుకపోయి తీవ్రంగా నష్టపోయాం.

\- దేవదాసు, రైతు

రెండు ఎకరాల గింజలు కొట్టుకపోయాయి



రెండు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగుచేశా. వర్షం కారణంగా పంట వాగులో కొట్టుక పోవడంతో తీవ్రంగా నష్టపోయాను. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

\- శ్రీనివాసులు, రైతు, బోణాల


నందికొట్కూరు: మొక్కజొన్న దిగుబడులను పరిశీలిస్తున్న సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు


వేంపెంట గ్రామంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు


గడివేములలో మొక్కజొన్న రైతులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ధర్మవరం సుబ్బారెడ్డికి మంత్రి అభినందనలు



సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 5: ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మవరం సుబ్బారెడ్డిని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం విజయవాడలో అభినందించారు. ధర్మవరం సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారానికి బీసీ హాజరయ్యారు. మారిటైం బోర్డు కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దామచర్ల సత్యను, అలాగే ఏపీఐఐసీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మంతెన రామరాజుకు మంత్రి బీసీ అభినందనలు తెలియజేశారు.

బేతంచెర్ల: రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దర్మవరం సుబ్బారెడ్డిని టీడీపీ బేతంచెర్ల నాయకులు, కౌన్సిలర్లు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల సమన్వయ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, టీడీపీ పట్టణ నాయకులు నారాయణ స్వామి, కౌన్సిలర్లు రామగోపాల్, నంద్యాల మధు ఉన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం


మాట్లాడుతున్న భార్గవ్‌రామ్ నాయుడు

చాగలమర్రి, అక్టోబరు 5: రాష్ట్రంలో టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు తెలిపారు. శనివారం చాగలమర్రిలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అన్నారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. రూ.4 వేలు పింఛన్‌లను పంపిణీ చేసి వృద్ధులు, దివ్యాంగులను ఆదుకున్నారని అన్నారు. టీడీపీ నాయకులు సూర్యనారాయణ, జెట్టి నాగరాజు, గురుశేఖర్‌రెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, గఫార్, నారాయణరెడ్డి, ఆవుల ప్రతాప్, రామ్మోహన్, జోసఫ్, రాజేష్, సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు

చాగలమర్రి, అక్టోబరు 5: మండలంలోని కేసీ ప్రధాన కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామని కేసీ కెనాల్ డీఈ పుల్లయ్య తెలిపారు. శనివారం రాజోలి ఆనకట్ట వద్ద కుందూలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాజోలి ఆనకట్ట వద్ద 9 వేల క్యూసెక్కుల నీటితో కుందూ ప్రవహిస్తోందని తెలిపారు. ఆనకట్ట వద్దగల 5 గేట్లను ఎత్తి కడపజిల్లా వైపుకు నీటిని విడుదల చేశామని అన్నారు. కేసీ ప్రధాన కాలువకు నీటి మట్టాన్ని తగ్గించామని అన్నారు. ఆయన వెంట ఏఈ జమాల్‌వలి, సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల, అక్టోబరు 5 : ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కోవెలకుంట్ల మండల పరిధిలోని చిన్నకొప్పెర్ల, వల్లంపాడు గ్రామాల మధ్య నల్లవాగు సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. వల్లంపాడు గ్రామానికి చెందిన ఆటోలో ముగ్గురు వ్యక్తులు ఎక్కి కోవెలకుంట్ల నుంచి వల్లంపాడు గ్రామానికి వెళ్తున్నారు. నల్లవాగు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవరుతోపాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నూతన మద్యం పాలసీ ప్రకారం టెండర్లు

డోన్(రూరల్), అక్టోబరు 5: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ద్వారా టెండర్లు జరుగుతాయని డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ సీఐ వరలక్ష్మి తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గానికి 16 వైన్‌షాపులు ప్రైవేటు వ్యక్తులకు కేటాయించామన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. ఒక షాపునకు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు రుసుం రూ. రెండు లక్షలు డీడీ రూపంలో చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు నాలుగు దరఖాస్తులు వచ్చాయని ఆమె తెలిపారు. ఏమైనా సందేహాలు నివృత్తి చేసుకోవడానికి డోన్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

9లోగా దరఖాస్తు చేసుకోవాలి

కోవెలకుంట్ల, అక్టోబరు 5: మద్యంషాపుల టెండర్ల దరఖాస్తులను ఈనెల 9లోగా చేసుకునేందుకు అవకాశం ఉందని సీఐ బాషా అన్నారు. శనివారం కోవెలకుంట్ల ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 మద్యంషాపులు ఉన్నాయన్నారు. కోవెలకుంట్ల మండలంలో 5, సంజామల మండలంలో 4, ఉయ్యాలవాడ మండలంలో 1, దొర్నిపాడులో 1 మద్యం షాపులకు అనుమతి ఉందన్నారు. సమావేశంలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌నాయక్, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ


చంద్రపల్లిలో పంట నమోదు వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ప్యాపిలి, అక్టోబరు 5: పంట నమోదును నిర్లక్ష్యం చేసిన వ్యవసాయ సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. శనివారం మండలంలోని కలచట్ల, చంద్రపల్లి గ్రామాల్లో ఆయన పొలాలు తిరిగి పంట నమోదు వివరాలను పరిశీలించారు. అలాగే వ్యవసాయశాఖ అధికారుల తీరుపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వ పరంగా సాయం అందుతుందన్నారు. అలాగే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలకు చీడ, పీడలు సోకే అవకాశం ఉందని, రైతుల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రాజేష్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలి వానకు నేలవాలిన మొక్కజొన్న

రుద్రవరం, అక్టోబరు 5 : రుద్రవరం మండలంలో శనివారం తెల్లవారుజామున గాలితో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం ధాటికి మొక్కజొన్న పంట నేలవాలింది.


నేలవాలిన మొక్కజొన్న పంట


నందవరంలో చంద్రఘంట అలంకారంలో అమ్మవారు, మద్దిలేటి క్షేత్రం, ఆళ్లగడ్డలో గాయత్రీదేవిగా..

భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు

దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మూడో రోజు శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


చాగలమర్రిలో శారదాదేవిగా..


రుద్రవరంలో సంతానలక్ష్మిగా..


శిరివెళ్లలో వైష్ణవీదేవిగా..


కోవెలకుంట్లలో గజలక్ష్మీదేవిగా..


ప్యాపిలి, కనకాద్రిపల్లెలో అన్నపూర్ణదేవిగా..


డోన్, సంజామల, ఉయ్యాలవాడలో అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు


అవుకులో బాలత్రిపురసుందరి దేవిగా..

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్(రూరల్), అక్టోబరు 5: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్ భవనంలో ఆటో డ్రైవర్లకు, ప్రైవేటు స్కూల్ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని డోన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్, ఆర్టీవో క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ డోన్ ప్రాంతంలో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. కెపాసిటీ మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, అక్టోబరు 5: చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులచే శనివారం వేద పండితుడు శ్రీనివాస్‌శర్మ, ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా చెన్నకేశవ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలుచేశారు. చాగలమ్మ, గంగాభవాని, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

చాగలమర్రి, అక్టోబరు 5: మండలంలోని చింతలచెరువు, మూడురాళ్లపల్లె గ్రామాల్లో నీట మునిగి దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ విస్తరణాధికారి దేవేంద్ర శనివారం పరిశీలించారు. నీట మునిగిన ఉల్లి, మినుము, వేరుశనగ పంట పొలాలను పరిశీలించి నష్టపరిహారం కోసం అంచన వేస్తున్నామని అన్నారు. పొలాల సమీపంలోగల వంక పొంగి ప్రవహించడంతో రైతులు సాగు చేసిన పంట పొలాల్లో ప్రవహించి నీట మునకకు గురయ్యాయని తెలిపారు. 20 రోజుల పంట కావడంతో మొక్కలు నీట మునగడంతో కుళిపోయి దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం కోసం ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్, వ్యవసాయాధికారికి నివేదికలు పంపిస్తామని అన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాల మంజూరు

బనగానపల్లె, అక్టోబరు 5: మండలానికి సబ్సిడీపై 2500 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. 25శాతం సబ్సిడీ శనగలు రైతులకు అందించనున్నట్లు తెలిపారు. క్వింటా సబ్సిడీపోను రూ.7,050లతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

'ఒకేషనల్' జీవిత పాఠాలు నేర్పిస్తుంది

రుద్రవరం, అక్టోబరు 5 : ఒకేషనల్ జీవిత పాఠాలు నేర్పిస్తుందని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, అగ్రికల్చర్ ట్రైనరు జ్యోతి ప్రియ అన్నారు. శనివారం రుద్రవరంలోని రైతుభరోసా కేంద్రం, మందుల షాపులను విద్యార్థులతో కలిసి సందర్శించారు. ఒకేషనల్ ట్రైనింగ్ ఏడురోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. వీఏఏ నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకంపై సమావేశం

కోవెలకుంట్ల, అక్టోబరు 5: మండలంలోని బిజినవేముల గ్రామ రైతుసేవా కేంద్రంలో పీఎం కిసాన్ పథకంపై చర్చించినట్లు టీడీపీ నాయకులు గజ్జల హుసేనయ్య శనివారం తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా పుల్లయ్య

బేతంచెర్ల, అక్టోబరు 5: పట్టణ విద్యుత్ ఏఈగా దూదేకుల పుల్లయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. డోన్ రహదారిలోని విద్యుత్ పోలీస్ స్టేషన్‌లో డీఈఈ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పుల్లయ్య బాధ్యతలు చేపట్టారు. ఏఈ మహబూబ్ వలి లైన్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌బాబు, లైన్‌మెన్ మస్తాన్, శ్రీనివాసులు గౌడు, కాంట్రాక్టర్లు కిషోర్‌బాబు, సురేంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి


మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు

ఉయ్యాలవాడ, అక్టోబరు 5: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 2047కు గ్రామాల అభివృద్ధిపై గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. గ్రామాలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలు తదితర అంశాలను గుర్తించాలన్నారు.

దొర్నిపాడులో మోస్తరు వర్షం

దొర్నిపాడు, అక్టోబరు 5: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం వర్షం కురిసింది. ఉమాపతినగర్, దొర్నిపాడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీరు నిల్వ చేరి కుంటను తలపిస్తోంది. కాలనీల్లో సైడు కాలువలు లేక పోవడంతో సీసీ రోడ్లపై మోకాలి లోతు వర్షపు నీరు నిలిచింది. కాలనీ వాసులు పలు ఇబ్బందులు పడ్డారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం తెల్లవారుజాము వరకు మోస్తరు వర్షం కురిసింది. చాలా కాలం తర్వాత వర్షం కురవడంతో రైతులకు కాస్త ఊపిరి వచ్చింది. మండలంలోని మదనంతపురం, చింతలాయపల్లె, కొలిమిగుండ్ల, ఇటిక్యాల, బెలుం తదితర గ్రామాల పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. దీంతో మదనంతపురం, అంకిరెడ్డిపల్లె గ్రామాల సమీపంలోని చిన్నవంక, పెద్దవంకల్లో వర్షపు నీరు ప్రవహించింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు చాలా గ్రామాల్లో ఎండిపోయిన పరిస్థితి నెలకొనగా కురిసిన ఓ మోస్తరు వర్షం ఆయా వర్గాల ప్రజల్లో సంతోషం నింపింది.


ఉమాపతి నగర్‌లో జలమయమైన కాలనీ

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.4.13 లక్షలు

బేతంచెర్ల, అక్టోబరు 5: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.4.13 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.4,13,495 ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆయన తెలిపారు. అలాగే నంద్యాల పట్టణానికి చెందిన సంగారెడ్డి ఆయన సతీమణి స్రవంతి (నంద్యాల జిల్లా ఆడిట్ అధికారి) దంపతులు 510 గ్రాముల వెండి నెమలి హారతి పల్లెంను విరాళంగా అందజేశారని ఈవో తెలిపారు.

వేధింపులు ఆపాలి: సీఐటీయూ

బేతంచెర్ల, అక్టోబరు 5 : మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజనం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లల విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వ సహకారంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ రంగు పులిమి తమ పార్టీ అధికారంలోకి వచ్చింది, మీరు పనుల తప్పుకోవాలని వేధించడం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

బనగానపల్లె, అక్టోబరు 5: బనగానపల్లె మండలంలోని నందవరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి నరేంద్ర స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బయన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

మద్యం సీసాలు స్వాధీనం

రుద్రవరం, అక్టోబరు 5: మండలంలోని మాచినేనిలపల్లె గ్రామంలో మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. వెంకట పుల్లమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సబ్సిడీ శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

ఉయ్యాలవాడ, అక్టోబరు 5: శనగ విత్తనాలు అవసరం అయిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 25 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతులకు శనగ విత్తనాలు అందిస్తుందన్నారు. అవసరమైన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

పలుకూరు ఈవోగా బాలాంజనేయులు

బనగానపల్లె, అక్టోబరు 5: బనగానపల్లె మండలం పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈవోగా బాలాంజనేయులను ఉన్నతాధికారులు నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. అలాగే పాతపాడు వీఆర్‌వోగా గోవిందప్ప, టంగుటూరు వీఆర్‌వోగా శివరామయ్య, కైప వీఆర్‌వోగా వెంకటేశ్వరరెడ్డిలను నియమించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలి

శిరివెళ్ల, అక్టోబరు 5 : మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరినట్లు శిరివెళ్ల మాజీ ఎంపీటీసీ, మత్స్యకార సంఘం నాయకుడు కొండబోయిన బాలచంద్రుడు తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆయన శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్షలాది మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. మత్స్యకార ప్రతినిధులకు తగిన గుర్తింపు ఇచ్చి ప్రోత్సహించాలని కోరినట్లు బాలచంద్రుడు వెల్లడించారు.

హనుమద్వాహనంపై వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

బేతంచెర్ల, అక్టోబరు 5: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమద్వాహనంపై వేంకటేశ్వర స్వామిని వైభవంగా ఊరేగించారు. శనివారం సాయంత్రం స్వామివారిని దేవస్థానం నుంచి గౌరిపేట మెయిన్ రోడ్డు పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి తిరిగి హైస్కూల్ మీదుగా దేవస్థానం చేరుకుంది. స్వామి వారి వాహనం ఊరేగింపులో మహిళలు కోలాటాల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్వనాథ రెడ్డి, వీరారెడ్డి, శ్రీధర్ రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రగతి సాధించడమే చంద్రబాబు లక్ష్యం

డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


నల్లమేకలపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, అక్టోబరు 5: రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రగతి సాధించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని నల్లమేకలపల్లి, చనుగొండ్ల గ్రామాల్లో ఎమ్మెల్యే కోట్ల పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందన్నారు. డోన్ నియోజకవర్గంలో చెరువులకు నీళ్లు నింపి రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడ్, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, చనుగొండ్ల శ్రీరాములు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇళ్లు

ప్యాపిలి, అక్టోబరు 5: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలో శనివారం చిల్లాకట్ట దగ్గర ఈశ్వరమ్మ ఇళ్లు కూలింది. దీంతో ఇంటిలోని టీవీ, గ్యాస్‌స్టౌ ఇతర వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు రూ.30వేలు నష్టం జరిగింది. టీడీపీ నాయకులు టి శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా సాయం అందిస్తామని బాధితురాలికి హామీ ఇచ్చారు.

డోన్ ఆర్ఐగా మస్తాన్

డోన్, అక్టోబరు 5: డోన్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మస్తాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వెల్దుర్తిలో ఆర్ఐగా పని చేస్తున్న ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. నాలుగేళ్లుగా డోన్ తహసీల్దార్ కార్యాల యంలో ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉంది. బదిలీల్లో భాగంగా ఆర్ఐగా మస్తాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. తహసీల్దార్ నాగమణిని ఆర్ఐ మస్తాన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వైభవంగా సుదర్శన హోమం


అహోబిలంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 5: దిగువ అహోబిలంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా శనివారం సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులకు సాంప్రదాయబద్ధంగా అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు.

రుద్రవరం: మండలంలోని నరసాపురం, రుద్రవరంలోని గుట్టకొండ, దొర్నిలక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం స్వాతి వేడుకలు నిర్వహించారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు.

ఉల్లి పంటలో కోత ప్రయోగం

డోన్(రూరల్), అక్టోబరు 5: మండలంలోని కొచ్చెర్వు, ధర్మవరం గ్రామాల్లో ఉల్లి పంటలో కోత ప్రయోగాలను చేపట్టారు. ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో ధర్మవరం గ్రామంలో రైతు చంద్రహాస్ రెడ్డి పొలంలో 2/2 ఎం ప్లాట్‌సైజ్ ఉల్లి పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. దిగుబడి 21కేజీల 500 గ్రాములు వచ్చినట్లు ఉద్యాశాఖ అధికారి కళ్యాణి తెలిపారు. అలాగే కొచ్చెర్వు గ్రామంలో రైతు వీరారెడ్డి పొలంలో ఉల్లిపంట కోత ప్రయోగం నిర్వహించగా.. దిగుబడి 20 కేజీల 900 గ్రాములు వచ్చినట్లు కళ్యాణి తెలిపారు. ఫ్యూచర్ జనరల్ బీమా కంపెనీ ప్రతినిధులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో గ్రామాభివృద్ధి

శిరివెళ్ల, అక్టోబరు 5: శిరివెళ్ల గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తామని పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్ తెలిపారు. శిరివెళ్ల మేజర్ పంచాయతీ కార్యదర్శిగా ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు బీసీ ఫిదా హుసేన్, సిద్ధిఖ్, రఫి, యూనుస్ బాషా, షఫివుల్లా, సికిందర్, జాఫర్‌లు కార్యదర్శి అశ్విన్ కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం నూతనంగా వచ్చిన ఎంపీడీవో శివ మల్లేశ్వరప్పను కలిసి సన్మానించి గ్రామంలోని ప్రధాన సమస్యలపై చర్చించారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

డోన్(రూరల్), అక్టోబరు 5: పట్టణంలోని కేవీఎస్ కాలనీలో ఉన్న అన్న క్యాంటీన్‌ను డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్‌లో తాగునీటి వసతిని పరిశీలించారు. భోజన నాణ్యతపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

డోన్, అక్టోబరు 5: డోన్ పట్టణంలో పారిశుధ్య లోపం తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ చాంబర్‌లో కమిషనర్ ప్రసాద్‌గౌడు, డీఈ రఘు, ఏఈ సురేష్‌లతో చైర్మన్ రాజేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సప్తశైల రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మున్సిపాలిటీ పరిధిలో రోగాలు ప్రబలకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా, వీధిలైట్లు అన్ని చోట్ల వెలిగేలా దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శనగ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల, అక్టోబరు 5: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ శనగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకుడు కత్తి రాందాస్ సూచించారు. శనివారం మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ సిబ్బందితో కలిసి ఆయన ప్రారంభించారు. మండలానికి మొత్తం 2480 క్వింటాళ్లు సబ్సిడీ శనగలు మంజూరైనట్లు ఏవో భూమాజ్యోతి వెల్లడించారు.


రశీదులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు